క్లుప్తంగా

వేధింపులకు పాల్పడటం సరికాదు



నిరసన తెలుపుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తదితరులు

యాచారం: ప్రభుత్వాలు.. పంచాయతీలకు పైసా నిధులు మంజూరు చేయకపోగా, చెప్పిన మాట వినడం లేదంటూ ఉద్యోగులను వేధింపులకు గురిచేయడం మంచిది కాదని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, పలు జీపీ కార్యదర్శులు అన్నారు. నల్లగొండ జిల్లాలో కలెక్టర్ నారాయణరెడ్డి.. ఎంపీడీఓతో పాటు ఇద్దరు జీపీ కార్యదర్శులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ.. పంచాయతీ రాజ్ శాఖ జేఏసీ పిలుపు మేరకు గురువారం నల్లా బ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ ఆఫీసు ఎదుట నిరసన వ్యక్తంచేశారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు స్నేహ, చిత్రంలో ఎంపీడీఓ

తలకొండపల్లి: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల పరిధి పడమటితండా, పాతాకోటతండా, ఖానాపూర్, గౌరిపల్లి గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ స్నేహ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేశారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞచేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డాక్టర్ చంద్రసింగ్, జీపీ కార్యదర్శులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

'స్వచ్ఛత' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ తదితరులు

తుర్కయంజాల్: స్వచ్ఛత హి సేవలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అనేక సమస్యలు దూరం అవుతాయన్నారు. అక్టోబర్ 2 వరకు జరిగే స్వచ్ఛతలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, పలుస శ్రావణ్ కుమార్ గౌడ్‌లు పాల్గొన్నారు.

విద్యాధికారికి సన్మానం



ఎంఈఓను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఆమనగల్లు: మండల విద్యాధికారి పగిడిపాల పాండును గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో పీఆర్‌టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. పీఆర్‌టీయూ నాయకులు మల్లీశ్వర్, మాధవరెడ్డి, భాస్కర్‌రావ్, మమత, నల్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రేబిస్ టీకా డ్రైవ్

పహాడీషరీఫ్: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీలో శుక్రవారం సామూహిక రేబిస్ టీకా డ్రైవ్ ను నిర్వహించనున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. బ్లూక్రాస్ ఎన్జీఓ, మిషన్ రేబిస్, వరల్డ్ వెటర్నరీ సర్వీసెస్ సహకారంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు షాహిన్‌నగర్ ఫ్రైడే మార్కెట్ స్థలంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. రేబిస్ కారణంగా మానవ మరణాలు సంభవించరాదన్న ఉద్దేశంతో మున్సిపాలిటీని రేబిస్ రహిత జోన్‌గా మార్చడానికి ప్రయత్నిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సేవకులు.. వీధి కుక్కలు, పెంపుడు శునకాలను తీసుకొచ్చి టీకా వేయించాలని కోరారు.



కడ్తాల్: ఐలమ్మ జయంతి వేడుకలో రజక సంఘం, రాజకీయ నాయకులు



ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్‌లో ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు తదితరులు

పోరాట స్ఫూర్తికి ప్రతీక ఐలమ్మ



ఇబ్రహీంపట్నంలో.. నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి తదితరులు



ఇబ్రహీంపట్నంలో.. బీఆర్ఎస్ నేతలు

'వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తికి ప్రతీక. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె చూపిన తెగువ మనందరికీ ఆదర్శం' అని పలువురు నాయకులు అన్నారు. గురువారం ధీర వనిత జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆమె విగ్రహాలు, చిత్ర పటాలకు అధికారులు, రాజకీయ, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల సంక్షేమ కోసం పాటుపడిన మహనీయురాలని, ఉద్యమాల్లో మహిళల పాత్ర అసమానమైనదని చాటి చెప్పిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని నాయకులు కోరారు.

– సాక్షి, నెట్‌వర్క్



యాచారం: వీరనారి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రజక నాయకులు



మంచాల: మండల కేంద్రంలో..



తలకొండపల్లి: మండల కేంద్రంలో..



కడ్తాల్: రావిచేడ్‌లో..

ఉచిత వైద్య పరీక్షలు

తలకొండపల్లి: పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. గురువారం మండల పరిధి పాతాకోటతండాలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు అఖిల్, అనిల్ నేతృత్వంలో, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో 174 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అలివేలు, జీరా నాయక్, గురుసింగ్, గోపినాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



అధ్యాపకుడు నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేస్తున్న నర్సింగరావుకు ఉస్మానియ విశ్వవిద్యాలయం డాక్టరేట్ పురస్కారాన్ని అందజేసింది. 'ఎఫెక్ట్స్ ఆఫ్ ప్లయోమెట్రిక్స్ ట్రైనింగ్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ జనరల్ మోటర్, ఎబిలిటీస్ అమాంగ్ ద కబడ్డీ అండ్ ఖోఖో ప్లెయర్స్ ఆఫ్ ఉస్మానియ యూనివర్సిటీ, హైదరాబాద్' అనే అంశంపై పాలమూరు విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య లక్ష్మీకాంత్ రాథోడ్ ఆధ్వర్యంలో నర్సింగ్‌రావు చేసిన పరిశోధనలకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు, సిబ్బంది నర్సింగ్‌రావుకు అభినందనలు తెలిపారు.

'పీఎం విశ్వకర్మ'ను వినియోగించుకోండి



యోజన పథకం కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

తలకొండపల్లి: పీఎం విశ్వకర్మ కౌసల్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా లబ్ధి పొందాలని మాజీ సర్పంచ్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధి పూల్‌సింగ్‌తండాలో పథకం కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హస్త కళ, చేతి వృత్తిదారుల ప్రోత్సాహకానికి పథకాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సులభతర రుణాలు, నైపుణ్య శిక్షణ, ఆధునిక యంత్ర పరికరాలు అందించడంతో పాటు, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. స్కీం ద్వారా రూ.3 లక్షల వరకు రుణం పొందవచ్చునన్నారు. సాంప్రదాయ పని ముట్లను ఉపయోగించేవారిని, కళాకారుల కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే పథకం లక్ష్యమన్నారు. పథకానికి 110 అర్జీలు వచ్చాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్ఈలు, స్థానిక గిరిజన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీని పరిశీలిస్తున్న అధికారులు, స్థానిక నాయకులు

కడ్తాల్: ఎట్టకేలకు సైడ్ డ్రైన్ డ్రైనేజీ మరమ్మతు పనులను గురువారం నేషనల్ హైవే అధికారులు ప్రారంభించారు. మండల కేంద్రంలోని తలకొండపల్లి కూడలిలో శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారిపై వర్షం నీరు వెళ్లేందుకు నిర్మించిన పైపులైను.. మూడు నెలల క్రితం కుంగిన విషయం తెలిసిందే. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల చొరవతో .. ఎన్‌హెచ్ఏఐ అధికారులు రెసిడెంట్ ఇంజినీర్ గంగాధర్, బ్రిడ్జి ఇంజినీర్ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోలర్ వేణు, సైట్ ఇంజినీర్ భట్టాచార్య లోకల్ ఇన్‌చార్జి రవీందర్ తదితరులు డ్రైనేజీని పరిశీలించి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఐదారు రోజుల్లో పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు మల్లేశ్‌గౌడ్, అశోక్, రాజేశ్, శ్రీకాంత్ ఉన్నారు.

స్వచ్ఛమైన నీటితో ఆరోగ్యం పదిలం

ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ చంద్రమౌళి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఈ చంద్రమౌళి

యాచారం: స్వచ్ఛమైన నీటితో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేయరాదని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ నీటి సరఫరా సిబ్బందికి శిక్షణా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సరఫరా విషయంలో సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. నీటి కలుషితం వలన వ్యాధులు సంక్రమిస్తాయని, నీటి సరఫరా పైపులను నిత్యం సరిచూసుకోవాలన్నారు. లీకేజీ అయినట్లు గుర్తిస్తే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ రాజేశ్వర్‌రావు, డీఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

'మహాధర్నా'ను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మాడ్గుల: బీసీ మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ బ్లాక్ వాయిస్ వ్యవస్థాపకుడు శ్రీధర్ గోవిందు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న కల్వకుర్తిలో నిర్వహించే ధర్నాకు పార్టీలకు అతీతంగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మహాసభ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, బీసీ నాయకులు గణేశ్, అనిల్, బక్కయ్య, వరుణ్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీటి సరఫరాపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్ తదితరులు

మంచాల: మిషన్ భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కార్యాలయంలో మండల పరిధి గ్రామాలకు చెందిన భగీరథ నీటి సరఫరా వాటర్‌మెన్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాలశంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ప్రధాన ఆధారం భగీరథ నీరన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. మోటార్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీలు, వాటర్ క్వాలిటీ టెస్టింగ్, హ్యాండ్ పంప్ రిపేరు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎంపీఓ ఉమారాణి, భగీరథ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పావని, అసిస్టెంట్ ఇంజనీర్ రూప పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండి..



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మంచాల: చట్ట ప్రకారం రావాల్సిన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తపస్ ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల బదిలీ అయిన, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జూలై నెల వేతనం రాలేదని, ఆ జీతాన్ని ఇప్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్, మంచాల మండల అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల బాధ్యులు వెంకటేశ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ రెడ్డి

తలకొండపల్లి: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధి ఖానాపూర్‌లో ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రమజీవులకు 8 గంటల పనిదినం అమలు చేస్తూ, అదనపు పనికి–అదనపు వేతనం చట్ట ప్రకారం ఇవ్వాలన్నారు. వలస కార్మికులకు 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం అమలు చేయాలని, కేంద్రం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కవిత, పడకల్ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి తదితరులు

విజయవంతం చేయండి..

మాడ్గుల: చలో లేబర్ కమిషనరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. మండల పరిధి బ్రహ్మణపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడారు. కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్‌పర్మినెంట్ ఎంప్లాయిస్ అందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, మహిళా కన్వీనర్ కవిత, అమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య తదితరులు ఉన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ఆమనగల్లు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం స్వచ్ఛత హి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమనగల్లును స్వచ్ఛతగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

కందుకూరు: పోషకాలతో కూడిన ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వరూప అన్నారు. మండల పరిధి లేమూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషన్ అభియాన్–2024లో భాగంగా పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు 6 నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలనే తాగించాలని, రెండేళ్ల వరకు తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచించారు. సీడీపీఓ శాంతిశ్రీ, ఎంపీడీఓ సరిత మాట్లాడుతూ.. పోషకాలతో పాటు సీజన్‌లో వచ్చే ప్రతి పండు తినాలని చెప్పారు. బయటి ఆహారాన్ని తీసుకోవద్దన్నారు. అంగన్‌వాడీల్లో అందజేసే గుడ్లు, పాలు శరీరానికి అవసరమైన పోషకాలు ఇస్తాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

కొత్తగూడలో వైద్య శిబిరం

కందుకూరు: మండల పరిధి కొత్తగూడలో కందుకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జీపీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రవీందర్, సూపర్‌వైజర్లు అర్చన, రఘురామ్, ఆశ వర్కర్లు అనిత, యాదమ్మ, రేణుక, ప్రేమలత పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని జన్మదిన వేడుకలు

కందుకూరు: దేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పుట్టిన రోజు వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

ఢిల్లీ వాల్డ్ పబ్లిక్ స్కూల్‌కు డైనమిక్ అవార్డు



అవార్డుతో నిర్వాహకులు

లింగోజిగూడ: తుర్కయంజాల్ మన్నెగూడలోని ఢిల్లీ వాల్డ్ పబ్లిక్ స్కూల్‌కు దీ డైనమిక్ స్కూల్ అవార్డ్ వరించింది. ఈ నెల 25న నగరంలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ఎడ్యుకేటర్స్ సమ్మిట్‌లో ఎడ్యుకేషన్ న్యూస్ నెట్‌వర్క్, ఎడ్యుకేషన్ టూ డే సంస్థలు ఈ అవార్డును ప్రకటించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, అకాడమిక్ డైరెక్టర్ మారుతీ రాంప్రసాద్‌కు అవార్డును అందజేరు. ఈ సందర్భంగా మారుతీ రాంప్రసాద్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సిబ్బందికి కృతజ్ఞతలు అన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: చదవుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జోనల్ స్థాయి క్రీడలను గురువారం పట్నం గురుకుల విద్యాపీఠ్‌లో స్థానిక చైర్‌పర్సన్ స్రవంతి ప్రారంభించారు. విజేతలకు నిరంజన్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ టోర్నీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ స్థాయి క్రీడలను తొలిమెట్టుగా భావించి, ఆటల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తానని వెల్లడించారు. పీఈటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెన్న కేశవరెడ్డి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం జోనల్ సెక్రటరీ సుశీల, పీఈటీలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

నిరుపేద కుటుంబానికి సాయం

ఆమనగల్లు: ఆర్థిక ఇబ్బందితో సతమతవుతున్న కుటుంబానికి ఓ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధి బండోనిపల్లి గ్రామానికి చెందిన ఏకుల అర్జున్ కుటుంబ జీవనోపాధి నిమిత్తం, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో సుంకిరెడ్డి.. బాధిత కుటుంబానికి రూ.43 వేలు అందజేశారు. గ్రామ నాయకులు రవి, ఉపేందర్, నరేశ్ ఉన్నారు.